క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ సంబరాలు



బాలికల గిరిజన హాస్టల్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు

మిర్యాలగూడ టౌన్‌ : హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఎన్నికల్లో అన్ని ప్యానెల్స్‌లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయకేతనం ఎగురవేయడంతో ఆదివారం పట్టణంలోని గిరిజన బాలికల హాస్టల్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్‌ మాట్లాడుతూ హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో అన్ని ప్యానెల్స్‌లో లౌకికవాద కూటమిని విద్యార్థులు గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు వదూద్‌, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, మనోహర్‌, రవి, మహేష్‌, తరుణ్‌, కార్తీక, సమద్‌, ఉపేందర్‌, రవి, మహేష్‌, ఇందుమతి, అంజలి, స్రవంతి, కార్తీక సింధు, రజిత గాయత్రి పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



పోలేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్‌నాయక్‌

చింతపల్లి : బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కల్యాణ్‌నాయక్‌ అన్నారు. 'ప్రజా గోస – బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పోలేపల్లి రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని, బీఆర్‌ఎస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్‌యాదవ్‌, నేనావత్‌ సుమన్‌నాయక్‌, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

డిండి : మండల పరిధిలోని దాసరినెమలిపూర్‌ గ్రామంలో కొనసాగుతున్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం భక్తులు స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మంతా భక్తులతో కిటకిటలాడింది. ప్రజలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గంగిడి కొండల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి,బాలయ్య, మాధవరెడ్డి, సర్పంచ్‌ నరసింహారావు పాల్గొన్నారు.

బీసీ బంధు అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రచారి

మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీసీ బంధు అమలు చేయాలని బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు చిలకమర్రి ఇంద్రచారి అన్నారు. ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా బీసీలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేతకు గురిచేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తుందే తప్పా వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేయడం లేదన్నారు. సీఎం కేసీఆర్‌ కొన్ని కులాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి మిగతా కులాల వారిని పక్కకు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీసీ బంధును అమలు చేసి బీసీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్‌): మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన బద్దెల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి గతంలో తనతో పాటు పదో తరగతి వరకు చదువుకున్న తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఆదివారం నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాగరాజు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో రావులపాటి రాజు, సతీశ్‌, వెంకట్‌రెడ్డి, రాజ్‌పాల్‌, నాగేష్‌, సైదులు, నాగరాజు, చంద్రయ్య, ప్రవీణ్‌, రవి, జానీ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

- మరమ్మతులకు నోచుకుని నిఘా నేత్రాలు
- తరచూ ప్రాంగణంలో దొంగతనాలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు, పోలీసులు



వైర్లు లేక వేలాడుతున్న సీసీ కెమెరా



నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

మిర్యాలగూడ టౌన్‌ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు ప్రధానమైన కేంద్రంగా మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ప్రతి రోజూ ఆ బస్టాండ్‌కు 50 వేల నుంచి 60వేలపై చిలుకుగా ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. దీంతో బస్టాండ్‌లో సీసీజీటీపు కిట్టుతో పాటు సీసీ కెమెరాలు సుమారు 12వరకు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల పాటు బాగానే నడిచాయి. కానీ ఐదేళ్లుగా ఆ కెమెరాలను పనిచేయడం లేదు. వాటిని మరమ్మతులు చేసే వారు లేరు. ఆ కెమెరాల వైర్లు వేలాడపడుతున్నాయి. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న మక్కువ బస్టాండ్‌ అభివృద్ధిపై లేదు. సీసీ కెమెరాల బాధ్యత పోలీసులదేనని ఆర్టీసీ అధికారులు అంటుండగగా కొంత వరకు మీరు కూడా బాధ్యత తీసుకోవాలని పోలీసులు పేర్కొంటున్నారు.

చోరీలకు పాల్పడుతున్నా..

ఏడాదిన్న కిందట బస్టాండ్‌ భారీగా డీజిల్‌ చోరీకి గురైంది. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించలేకపోయారు. తరచూ బస్టాండ్‌లో దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఎవరైనా అసాంఘిక శక్తులు బస్టాండ్‌లోకి వచ్చినా గుర్తించే పరిస్థితి లేదు. ఎవరూ వస్తున్నారో. ఎవరూ వెళ్తున్నారో తెలియని పరిస్థితి. బస్టాండ్‌లో ఏదైనా ఘటన జరిగితే సాగర్‌ రోడ్డులో ఎవరైన షాపు వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో వారి వద్దకు వెళ్లి పరిశీలించుకోవాల్సి వస్తుంది. ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్లకు ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటికైన అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా పర్యవేక్షణ ఏర్పాటు చేయాల్సి ఉంది.

సీసీ కెమెరాలను పునరుద్ధరించాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పునరుద్ధరించాలి. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం దురదృష్టకరం. బస్టాండ్‌లోకి ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలయని పరిస్థితి ఉంది. ఏమైనా అనుకొని సంఘటన జరిగితే కెమెరాల ద్వారా పరిశీలించే అవకాశం లేకుండా పోయింది. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే చోరీలను నియంత్రించవచ్చు.

– జ్వాల వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ

పోలీస్‌ శాఖ పర్యవేక్షణలోనే ఉంది



ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమరాలు పర్యవేక్షణ మొదటి నుంచి పోలీస్‌ శాఖ పర్యవేక్షణలో ఉండేది. బస్టాండ్‌లో సీసీ కెమరాల పర్యవేక్షణకు కావాల్సిన గదితో పాటు విద్యుత్‌ సౌకర్యం కేటాయిస్తాం. ఈ విషయంపై పోలీస్‌ శాఖతో చర్చించి సమన్వయంతో సీసీ కెమెరాల పర్యవేక్షణ చేయిస్తాం.

– బొల్లెద్దు పాల్‌, డీఎం మిర్యాలగూడ

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. ఆదివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏపల్లి మండలానికి చెందిన 21మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం రూ.1లక్ష అందిస్తూ కొండంత భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ వల్లపురెడ్డి, తోటకూరి పరమేశ్‌, శేఖర్‌రెడ్డి, రమావత్‌ చందు, బొడ్డుపల్లి కృష్ణ, జటావత్‌ స్వామి, సుధాకర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మగ్దూం షావలి దర్గా

చందంపేట : మండల కేంద్రంలోని మగ్దూం షావలి దర్గా ఉర్సు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మగ్దూం షావలి దర్గా ఉర్సులో పాల్గొని గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్‌ను ప్రారంభించారు. చిత్రియాల పీఏసీఎస్‌ చైర్మన్‌ జాలె నర్సింహారెడ్డి ఉర్సులో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, స్థానిక సర్పంచ్‌ గోసుల కవితఅనంతగిరి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, శంకర్‌నాయక్‌, మోహన్‌కృష్ణ, గోసుల శివ, రామకృష్ణ, బొడ్డుపల్లి కృష్ణ, సోను, ఖలీల్‌, మగ్దుం, ఎంపీటీసీ మల్లయ్య, కోఆప్షన్‌ మెంబర్‌ సాధిక్‌, యాదయ్య, శ్రీధర్‌, శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలి



మంత్రి జగదీశ్‌రెడ్డికి విన్నవిస్తున్న వర్ర వెంకట్‌రెడ్డి

హాలియా : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో మలిదశ ఉద్యమకారులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ హాలియా మున్సిపల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ ఫ్లోర్‌ లీడర్‌, జిల్లా కౌన్సిల్‌ ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న మలిదశ ఉద్యమకారులపై అక్రమంగా రౌడీషీటర్ల కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి 8ఏళ్లకుపైగా అయినా మలిదశ ఉద్యమకారులపై పెట్టిన కేసులు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. తమపై అక్రమంగా నమోదైన కేసుల వల్ల తాము మానసికంగా ఇబ్బంది పడుతున్నామని వెంటనే కేసులు ఎత్తివేయాలని కోరారు.

పలకరిస్తూ.. సమస్యలు వింటూ

- హాలియాలోని 5వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే నోముల భగత్‌



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్‌

హాలియా : నాగార్జునసాగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్‌ హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో ఆదివారం ఉదయం కాలినడకన పర్యటించారు. వార్డులో కనిపించిన ప్రతి ఒక్కరినీ పలకరించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను వింటూ చేయి చేయి కలుపుతూ నేనున్నాననే భరోసా కల్పించారు. ఉప ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్‌ హాలియా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో ఐదో వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భగత్‌ పర్యవేక్షిస్తూ.. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా తమ ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలను అడిగిన దాఖలాలు లేవని ప్రస్తుత ఎమ్మెల్యే భగత్‌ తమ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపడం తమకు ఆనందంగా ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే భగత్‌కు వివరించారు. కాలనీలో ఉన్న పురాతన డ్రెయినేజీలో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదని, కాలనీలో పందుల బెడద అధికంగా ఉందని, మిషన్‌ భగీరథ నీరు సక్రమంగా రాక తాము ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, వైస్‌ చైర్మన్‌ నల్లగొండ సుధాకర్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాలు, వార్డు అధ్యక్షుడు ఎంకోటి బాలకృష్ణ, పట్టణ అధికార ప్రతినిధి సురభి రాంబాబు, యూత్‌ అధ్యక్షుడు సైదాచారి, ప్రధాన కార్యదర్శి కొండేటి అశోక్‌, పట్టణ ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శి బుర్రి మొగులయ్య, నాయకులు సాయి, అనిల్‌ తదితరులు ఉన్నారు.

నేడు హాలియా మార్కెట్‌ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

హాలియా: హాలియా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, రిటైర్డ్‌ ఎంఈఓ జవ్వాజి వెంకటేశ్వర్లు, వైస్‌ చైర్మన్‌గా పెద్దవూర మండలంలోని వెల్మగూడెం గ్రామానికి చెందిన ఆడెపు రామలింగయ్య, డైరెక్టర్లు సపావట్‌ హరిసింగ్‌, పగిడిమర్రి మరియమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ, సురభి రాంబాబు, పాదిల శ్రీనివాస్‌, రమావత్‌ రాజేష్‌నాయక్‌, సైయ్యద్‌ మస్తాన్‌, పోషం శ్రీనివాస్‌గౌడ్‌, జటావత్‌ చందర్‌, శేఖర్‌, చిట్టిప్రోలు వెంకటేశ్వర్లుతో మార్కెటింగ్‌ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్న ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభను విజయవంతం కార్యకర్తలు, నాయకులు సూచించారు.

విగ్రహాలకు జలాభిషేకం

నిడమనూరు : మండలంలోని ముకుందాపురంలో ఆదివారం దేవతా విగ్రహాలకు జలాభిషేకం చేశారు. గ్రామంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన, వివిధ దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. దేవతా విగ్రహాలకు ముదిమాణిక్యం మేజర్‌ కాలువ వద్ద జలాభిషేకం నిర్వహించి శుద్ధి చేశారు. గ్రామంలో ఆదివారం విఘ్నేశ్వరపూజ, చండీయాగం, హోమాలు, రాత్రి ధాన్యదివాసం నిర్వహించారు.

దేవరకొండ కోర్టును సందర్శించిన హైకోర్టు జడ్జిలు

దేవరకొండ : దేవరకొండ మున్సిప్‌ కోర్టును ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌ జస్టిస్‌ పి.నవీన్‌రావు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ కె.లక్ష్మణ్‌ సందర్శించారు. నేరెడుగొమ్ము మండలం పెద్ద మునిగల్‌లో ఏర్పాటు చేసిన న్యాయసేవా సదస్సులో పాల్గొనడానికి వచ్చిన వారు దేవరకొండ కోర్టును సందర్శించి బార్‌ అసోసియేషన్‌, కోర్టు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు దేవరకొండ మున్సిప్‌ కోర్టు ప్రధాన జూనియర్‌ సివిల్‌ జడ్జి రవీందర్‌, అడిషనల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి అజయ్‌కుమార్‌, బార్‌ అసోసియేషన్‌ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని బార్‌ అసోసియేషన్‌ సభ్యులు విన్నవించారు. అంతకుముందు న్యాయమూర్తులు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్‌, కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు, జిల్లా న్యాయమూర్తులు, బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లి : సాయినాథుడి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

సాయినాథుడి ఆలయంలో..

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ పి. నవీన్‌రావు, జస్టిస్‌ కె. లక్ష్మణ్‌లు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌ మంచికంటి ధనుంజయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయినాథుడి దేవాలయంలో న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్‌, ఒకటో అడిషనల్‌ జిల్లా జడ్జి జయరాజ్‌, 2వ అడిషనల్‌ జిల్లా జడ్జి తిరుపతి, సీనియర్‌ సివిల్‌ జడ్జి రవీందర్‌, బార్‌ అసోసియేషన్‌ సభ్యులు ఉన్నారు.

భూకబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో సర్వే నంబర్‌ 803లో తమకు ఉన్న 2.38గుంటల భూమిని కొందరు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని వారి నుంచి తమ భూములకు రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు. ఆదివారం మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులు సాబెరాబేగం, లతీఫాబేగం, జాహెదాబేగం, మీనాబేగంలు మాట్లాడుతూ ప్రకాశ్‌నగర్‌లో సర్వే నంబర్‌ 803లో తమ భూమి ఉండగా సర్వే నంబర్‌ 802లో మందుల ఎల్లయ్య, మందుల అశోక్‌కు చెందిన భూములు ఉన్నాయని, వారు తమ భూమిలోకి ప్రవేశించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మిర్యాలగూడ టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయం ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లగా ధరణి రికార్డ్‌ చూసి పట్టా మీ దేనని పట్టా చేసుకోవాలని సలహా ఇవ్వడంతో పాస్‌బుక్‌ కోసం దరఖాస్తు చేసుకోని తహసీల్దార్‌ వద్దకు వెళ్లగా కౌన్సిలర్‌ మలగం రమేష్‌యాదవ్‌ పాస్‌బుక్‌ ఇవ్వకుండా తహసీల్దార్‌పై ఒత్తిడి చేశాడని తెలిపారు. కలెక్టర్‌ను ఆశ్రయించగా స్థానిక తహసీల్దార్‌ను సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ ఆదేశించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. కబ్జాదారుల నుంచి తమ భూములకు రక్షణ కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. లేనట్లయితే సీఎం కేసీఆర్‌ను ఆశ్రయించి తమ బాధను తెలుపుకుంటామని బాధితులు పేర్కొంటున్నారు. సమావేశంలో కౌన్సిలర్‌ ఇలియాస్‌ఖాన్‌ పాల్గొన్నారు.

గిరిజన సంఘం మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్‌ : మార్చి 1, 2, 3 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ మహాసభల ఆహ్వాన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో నియోజకవర్గ జనరల్‌ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 1న హనుమాన్‌పేట ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి నుంచి భారీ ర్యాలీ తీసిన అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఎన్‌ఎస్పీ గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు మాజీ ఎంపీ, ఆదివాసి అధికార్‌ రాష్ట్రీయ మంచ్‌ జాతీయ నాయకురాలు బృందాకారత్‌, మాజీ ఎంపీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు ఎం.ధర్మానాయక్‌, ఆర్‌.శ్రీరాంనాయక్‌ లు హాజరవుతారని తెలిపారు. 2 3 తేదీల్లో ప్రతినిధుల సభ ఏఆర్‌సీ ఫంక్షన్‌ హాల్‌ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు వేయి మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. బహిరంగ సభకు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బావండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, గాదె పద్మ, కేవీపీఎస్‌ నాయకులు పరశురాములు, మంగారెడ్డి, నాగమణి, సత్యనారయణరావు, చెనగాని యాదగిరి, ఉర్మిల తదితరులున్నారు.

మహాసభ పోస్టర్‌ ఆవిష్కరణ

పెద్దఅడిశర్లపల్లి : మార్చి 1నుంచి మిర్యాలగూడెంలో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్‌ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మా ట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్‌ జిల్లా నాయకులు పెరికె విజయ్‌కుమార్‌, సత్యనారాయణ, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్‌ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామాని చెందిన కుంచం రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమెకు బీఆర్‌ఎస్‌ పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో పాటు పార్టీ బీమా సౌకర్యం ఉండటంతో ఆమెకు స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు సహకారంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కు ఆమె కుమారుడు వినోద్‌కు జిల్లా రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ సంజీవరెడ్డి, సర్పంచ్‌ దుండిగాల యాదమ్మశ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు, కొండేటి రవి, వడ్డేర సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, వెంకటేష్‌ తదితరులున్నారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ తిరునగరు భార్గవ్‌

మిర్యాలగూడ టౌన్‌ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్పోకెన్‌ ఇంగ్లీష్‌ ట్రైనర్‌, సోషల్‌ సర్వీస్‌ ఆర్గనైజర్‌ హమీద్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆదివారం తన నివాసంలో మున్సిపల్‌ చైర్మన్‌ తిరునగరు భార్గవ్‌ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ భార్గవ్‌ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పట్టుదల, కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి ఎల్‌ అక్షిత (అభ్యాస్‌ టెక్నో స్కూల్‌), ద్వితీయ బహుమతి కె. గౌతమ్‌(నేతాజీ హైస్కూల్‌) విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఉదయ్‌ భాస్కర్‌, నాయకులు ఖాదర్‌, అమృతం సత్యం, కందగట్ల అశోక్‌, నేతాజీ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీపతి శ్రీనివాస్‌, బాబా షర్పుద్దీన్‌ పాల్గొన్నారు.

రేపు వికలాంగులకు బస్‌పాసులు

మిర్యాలగూడ టౌన్‌ : మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 28న వికలాంగులకు ఉచిత బస్‌పాసులను ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్‌ బొల్లెద్దు పాల్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్‌పాసులను పర్సంటేజ్‌ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇస్తున్నందున వికలాంగులు ఆధార్‌కార్డు, సదరనం సర్టిఫికేట్‌ జీరాక్స్‌లతో పాటు ఒక పాస్‌ ఫొటో సైజ్‌ను తీసుకురావాలన్నారు. .

ఘనంగా ఉప్పలమ్మ పండుగ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భగత్‌, తదితరులు

పెద్దవూర : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఉప్పలమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి నుంచే ఉప్పలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులుతీర్చుకున్నారు. నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే నోముల భగత్‌ ఉప్పలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో పండుగను నిర్వహించటం గొప్ప సాంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడెం డీఎస్పీ పి.వెంకటగిరి, సాగర్‌ సీఐ కె.నాగరాజు, ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ గుంటుక వెంకట్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గజ్జెల లింగారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జటావత్‌ రవినాయక్‌, సర్పంచ్‌లు దండ మనోహర్‌రెడ్డి, దాసరి సైదమ్మనాగయ్య, మెండె విష్ణుప్రియాసైదులు, శ్రీను, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

గుర్రంపోడు : మండలంలోని వట్టికోడు గ్రామంలో ఆదివారం రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం తెల్లవారు జాములన వేద మంత్రోచ్చరణల నడుమ జరిగింది. అనంతరం విమాన రథోత్సవం, ఊరేగింపు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్‌ కేసాని గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ కేసాని యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

నంబర్‌ లేని వాహనాలు సీజ్‌

- వన్‌టౌన్‌, టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో 45బైక్‌లు పట్టివేత



పట్టుపడిన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

మిర్యాలగూడ అర్బన్‌ : ద్విచక్ర వాహనాలకు నంబర్‌ ప్లేట్లు లేకుండా నడుపుతున్న వాహనాలను ఆదివారం ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి సీజ్‌ చేశారు. డీఎస్పీ వెంకటగిరి ఆదేశాలతో వన్‌టౌన్‌, టూటౌన్‌ సీఐలు రాఘువేంద్ర, నిగిడాల సరేష్‌కుమార్‌ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన తనిఖీల్లో వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో 25, టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిదిలో20 దిక్వచక్ర వాహనాలను పట్టుకుని ఆయా స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, నంబర్‌ ప్లేట్లు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి వాహనాలను సీజ్‌ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్‌ఐ కోటేష్‌, వన్‌టౌన్‌ ఎస్‌ఐ అనంతుల శివతేజ పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

చండూరు(గట్టుప్పల) : చేనేత కార్మికులకు న్యాయం చేయాలని ఆల్‌ ఇండియా వీవర్స్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్‌ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలన్నారు. మార్చి 5 తేదీన హైదరాబాద్‌ పరిధిలోని ఆటోనగర్‌ కర్నాటి గార్డెన్‌లో చేనేత కార్మికులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, చేనేత సంక్షేమ పథకాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నామని గోపాల్‌, ఇడెం కైలాసం, రాపోలు జగన్‌, పరమేశ్‌ పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ మొబైల్‌ ల్యాబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



మొబైల్‌ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని ఫుడ్‌ సేఫ్టీ ఆన్‌ వీల్స్‌ మొబైల్‌ ఫుడ్‌ ల్యాబోరేటరీని స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మొబైల్‌ ల్యాబ్‌ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పి స్వాతి, డాక్టర్‌ సుమన్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.